క్లుప్తంగా

రేపు పట్టుబడిన వాహనాలకు వేలం

జమ్మలమడుగు : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 30వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి లత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన వాహనాలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహించి వేలంపాటలో దక్కించుకున్న వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తారన్నారు. వేలం పాటలో పాల్గొనే అభ్యర్థులు గుర్తింపు కార్డుతో హాజరు కావాలని సూచించారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలందుకుంటున్న గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలు చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలి

జమ్మలమడుగు : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రీ తెలిపారు. ఆస్థానయే బడే గౌస్‌పీరాఖాద్రీ 911 ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. నిరుపేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆగస్టీన్ రాజు ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ వైద్యులు మోసిన్ కమాల్, గైనకాలజిస్టు డాక్టర్ తేజస్విని, డాక్టర్ డేవిడ్, డాక్టర్ గౌసియా తదితరులు రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియా ఖాద్రీ, సయ్యద్‌షా మహమ్మద్ తాహీర్ పీరాఖాద్రీ, కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

జమ్మలమడుగు : ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడంతోపాటు చెట్లను నరకకుండా సంరక్షించుకుని పర్యావరణాన్ని కాపాడుకుందామని ముద్దనూరు ఫారెస్టు అధికారి చంద్రశేఖర్ రావు తెలిపారు. ఆదివారం ప్రపంచ పర్యావరణ జీవన విధానంపై అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని పలు ప్రాంతాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ కవర్ల వాడకం విచ్చల విడిగా వాడటంతో భూవాతావరణం వేడిఎక్కి పర్యావరణంలో మార్పులు వస్తున్నాయన్నారు. అనంతరం వివిధ ప్రాంతాలలో ఉన్న వాటర్‌బాటిల్‌ను సేకరించి భవిష్యత్‌లో ప్లాస్టిక్‌కు వాడకుండా పర్యావరణాన్ని కాపాడుతామంటూ యువతతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడీ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : బద్వేలు డిపో నుంచి వేలాంగిణి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు నుంచి వేలాంగిణికి ప్రతి శుక్రవారం (జూన్ 2,9,16,23,30 తేదీలు) ప్రత్యేక బస్సు ఉంటుందని, శుక్రవారం సాయంత్రం 7 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 10 గంటలకు వేలాంగిణి చేరుకుని మళ్ళీ అక్కడి నుంచి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 5 గంటలకు బద్వేలుకు చేరుకుంటుందని తెలిపారు. బద్వేలు–వేలాంగిణి టిక్కెట్ ధర రూ.2430లు, పోరుమామిళ్ల–వేలాంగిణి రూ.2530లు ఉంటుందని తెలిపారు. అలాగే బద్వేలు నుంచి అరుణాచలంకు పౌర్ణమి సందర్భంగా జూన్ నెల 3వ తేదీన ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని, ఈ బస్సు 3వ తేదీ సాయంత్రం 7 గంటలకు బయలుదేరుతుందని, టిక్కెట్ ధర రూ.1240లు ఉంటుందని తెలిపారు.

నేడు బైక్ ర్యాలీ

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించి పేదలకు ఇచ్చిన సెంటు స్థలం శవాలను పూడ్చుకోవడానికి కూడా పనికి రాదని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించినందుకు నిరసనగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు. రామేశ్వరం నుంచి గాంధీ రోడ్డు, టీబీ రోడ్డు, శివాలయం రోడ్డు మీదుగా మైదుకూరు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగుతుందని ఆయన వివరించారు.

ఖరీఫ్‌లో వేరుశనగ సాగుపై దృష్టి

- సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు
- నియోజకవర్గంలో వేల ఎకరాలలో పంటల సాగు
- జూన్ మొదటి వారంలో విత్తన కాయల పంపిణీ


పొలంలో సేద్యం చేస్తున్న రైతు

వేముల : ఈ ఏడాది ఖరీఫ్ సాగులో వేరుశనగ పంటపై రైతులు దృష్టి పెట్టారు. గతంలో ఖరీఫ్‌లో ప్రధాన పంటగా వేరుశనగ పంట సాగయ్యేది. అయితే సాగులో పెట్టుబడులు పెరిగిపోవడం, దిగుబడులు రాకపోవడంతో రైతులు వేరుశనగ సాగుకు ఆసక్తి చూపలేదు. గతంలో కె6 అనే రకం వేరుశనగను రైతులు సాగు చేసేవారు. ఈ రకం వేరుశనగ సాగు రైతులకు నష్టాలను తెచ్చిపెట్టింది. దీంతో ఎక్కువ మంది రైతులు లేపాక్షి 1892 అనే రకం వేరుశనగ కాయలను సాగుకు ఎంచుకుంటున్నారు. సాగులో దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ముందుకు వస్తున్నారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన వేరుశనగ విత్తన కాయలను 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతులకు అందిస్తోంది.

పొలాలలో సేద్యాలు చేస్తున్న రైతులు :

ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో రైతులు పొలాల్లో ముమ్మరంగా సేద్యాలు చేస్తున్నారు. వర్షాలు పడటంతో రైతులు పొలాలకు మట్టి, పశువుల ఎరువులు తోలుతున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే జూన్ రెండవ వారంలో పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ బోర్ల కింద పంటలు సాగయ్యాయి. వర్షాధారం కింద మెట్ట భూములలో పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

రైతులకు భారంగా మారిన బాడుగలు :

పంటల సాగులో పెట్టుబడులకు తోడు బాడుగలు భారమవుతున్నాయి. పంట సాగు చేయాలంటే ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇప్పటికే ట్రాక్టర్ల, ఎద్దుల బాడుగలు పెంచేశారు. ఎకరా సేద్యం చేసేందుకు ఎద్దులకు రూ.600లు బాడుగ తీసుకుంటున్నారని రైతులు అంటున్నారు. పంట సాగు చేయాలంటే రెండు సార్లు సేద్యాలు చేస్తున్నామని.. దీంతో సాగులో పెట్టుబడులు పెరుగుతున్నాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.15 వేలకుపైనే పెట్టుబడులు :

ఖరీఫ్ సాగు పెట్టుబడులతో కూడుకున్నది. వర్షంతో రైతులు పంటల సాగుపై నిర్ణయం తీసుకుంటున్నారు. వేరుశనగ సాగు చేయాలంటే రూ.15 వేలు పెట్టుబడులు పెట్టాల్సివస్తోందని రైతులు అంటున్నారు. బయట మార్కెట్‌లో వేరుశనగ కాయల బస్తా రూ.3 వేల ధరలు ఉన్నాయని, ఎకరాకు మూడు బస్తాలు అవసరమవుతాయని రైతులు అంటున్నారు. దీంతో విత్తన కాయలకు ఎరువులు, సేద్యాలకు పెట్టుబడి రూ.15 వేలు దాటుతోందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు పెట్టినా పంట సాగు చేస్తే వర్షాభావంతో పంట దెబ్బతింటే నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

నియోజకవర్గంలో వేల ఎకరాలలో సాగు.. :

పులివెందుల నియోజకవర్గంలో వేల ఎకరాలలో ఖరీఫ్‌లో పంటలు సాగవుతాయి. అన్ని పంటలను జూన్ రెండవ వారంలో సాగు చేయనున్నారు. ఖరీఫ్‌లో ఎక్కువగా వేరుశనగ, మినుము, ఉల్లి పంటలను సాగు చేస్తారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో జూన్ నెలలో పంటలు సాగు చేసే యోచనలో ఉన్నారు. వర్షాలు కురిసి ఉష్ణోగ్రతలు తగ్గితే ఉల్లి పంటను సాగు చేయనున్నారు. అలాగే జూన్ నెలలో మినుము, వేరుశనగ పంటలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

జూన్ మొదటివారంలో విత్తన పంపిణీ :

ఖరీఫ్ సాగుకు రైతులకు అవసరమైన సబ్సిడీ వేరుశనగ కాయలను ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులు విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తైన వెంటనే రైతులకు సబ్సిడీ విత్తన కాయలను అందించాలన్నారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో రైతులకు విత్తన కాయలను అందిస్తోంది. జూన్ మొదటి వారంలో రైతులకు పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది.

మండల వారీగా సబ్సిడీ విత్తన కాయల మంజూరు వివరాలు :

మండలం	మంజూరైన విత్తన కాయలు క్వింటాళ్లు
పులివెందుల	110
వేముల	950
వేంపల్లె	180
లింగాల	500
తొండూరు	600
సింహాద్రిపురం	120
చక్రాయపేట	1900

మానవత సేవలు మరువలేనివి

ఎర్రగుంట్ల : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని ఎర్రగుంట్ల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఎర్రగుంట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గౌతమ్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పట్టణంలో నివాసముండే నల్లబల్లె రఘునాథ్ బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. వీరికి వైద్య ఖర్చుల నిమిత్త రూ.15 వేలు సంస్థ తరుపున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షుడు కల్లూరు గంగాధర్‌రెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై బైక్ ర్యాలీ

చాపాడు: 2014 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను మోసం చేస్తూ.. మళ్లీ మోసపూరిత హామీలు ఇస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీరును నిరసిస్తూ సోమవారం చేపట్టబోయే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ మేనిఫేస్టోలో చేస్తున్న మోసాలను ఎండగడుతూ.. సోమవారం ఉదయం 8 గంటల నుంచి దువ్వూరులోని కోదండ రామాలయం నుంచి ప్రారంభమై గుడిపాడు, చింతకుంట, మైదుకూరు మీదుగా ఖాజీపేటలోని కేసీ కెనాల్ బంగ్లా వరకూ 3వేల బైక్‌లతో ర్యాలీ జరుపటం జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు స్వచ్ఛంగా బైక్‌లో ర్యాలీలో పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


జానపద నృత్యం వేస్తున్న చిన్నారులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. బావర్చి రెస్టారెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ మాస్టర్ యువకిషోర్ ఆధ్వర్యంలో చిన్నారులు జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు అలరించాయి. శిల్పారామ ఏఓ సుధాకర్, రెస్టారెంట్ నిర్వాహకుడు శ్రీకాంత్, రాజు డ్యాన్స్ మాస్టర్ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన


పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందులలోని గ్రంథాలయంలో ఆదివారం సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పురాణ కథలు చెప్పడంపై అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలతో పాటు న్యూస్ పేపర్లు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రంథాలయంలో విద్యార్థులకు లస్సీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణకిషోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే వారిని ఆదరించాలి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : అభివృద్ధి చేసే వారిని ఆదరించాలే గాని అసత్య ఆరోపణలు పత్రికల్లో రాస్తే ప్రజలు సహించరని, ఆ పత్రికలను ప్రజలు ఆదరించకపోతే శాశ్వతంగా మూసుకోవాల్సిందేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఓ ప్రధాన పత్రికలో వచ్చిన కమలాపురం...ప్రగతికి దూరం అనే కథనానికి స్పందించి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంత చిత్తశుద్ధితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారో... తాను కూడా ఎమ్మెల్యేగా అంతే చిత్తశుద్ధితో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానన్నారు. కమలాపురంలో మైసూరారెడ్డి, వీరశివారెడ్డి, మహానేత వైఎస్సార్ దయతో ఎంఎల్‌సీ ట్యాగ్ వేసుకున్న వారి హయాంలో ఏ మేరకు అభివృద్ధి చెశారో ప్రజలకు తెలుసన్నారు. విమర్శకుల గురించి తాను పట్టించుకోనని, తాను నియోజకవర్గాన్ని మనస్ఫూర్తిగా అభివృద్ధి చేస్తానన్నారు. అది నా బాధ్యత అని, ప్రజలకు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు తాను నియోజకవర్గాన్ని అభివృద్ధి చెయాల్సిందేనన్నారు. రూ. 58.2 కోట్లతో మంచి నీటి పథకాన్ని ప్రారంభించామని, మరో ఆరు నెలల్లో అది పూర్తి అవుతుందన్నారు. పైప్‌లైన్‌తో పాటే సీసీ రోడ్లు, రోడ్ల విస్తరణ, బ్యూటిఫికేషన్, లైటింగ్ అన్ని పనులు జరుగుతాయన్నారు. ఇప్పటికే ఆసుపత్రి, పాలిటెక్నిక్ భవనం, సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, మార్కెట్ యార్డులో యూపీహెచ్‌సీ, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించామన్నారు. త్వరలో ఆర్ఓబీ, బైపాస్ అన్ని చేస్తామన్నారు. కరోనా లేక పోతే కొప్పర్తికి ఇప్పటికే వందల సంఖ్యలో పరిశ్రమలు వచ్చేవన్నారు. అయినప్పటికి పరిశ్రమలు వస్తున్నాయని, పనులు పూర్తి కావడానికి కొంత సమయం పడుతుందన్నారు. ఏపీలో మహా నగరంగా మార్చడానికి కొప్పర్తిని సీఎం ఎంపిక చేశారంటే కమలాపురం నియోజకవర్గంపై సీఎంకు ఎంత ప్రేమ, అభిమానం ఉందో తెలుస్తుందన్నారు. మహానగరంలో వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఏడాకి రూ.250 కోట్లు వెచ్చిస్తుందన్నారు. భవిష్యత్తులో కొప్పర్తి మహానగరంగా అవతరించడం ఖాయం అన్నారు. ఒకప్పుడు ప్రధాన పత్రికగా మంచి క్రెడిబులిటి ఉన్న పత్రిక, యాజయాన్యానికి జగనన్న పాలన చూసి కడుపు మంట ఉందని, వారికి జెలిజిల్ మాత్రలు ఇవ్వాలన్నారు. అసత్య ఆరోపణలు రాస్తున్న ఆ పత్రికను ప్రజలు ఆదరిచడంలేదని, త్వరలో కొన్ని పత్రికలు, ఛానళ్లు మూసుకోవాల్సిందేనని ఆయన అన్నారు. అబద్ధపు వార్తలు కాదని, వాస్తవాలు తెలుసుకుని వార్తలు రాయాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

డీఎస్పీ వినోద్‌కుమార్


పులివెందులలో మహిళతో మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్


చిన్నదండ్లూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంజీవరెడ్డి

పులివెందుల : పులివెందుల డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని నగరిగుట్ట, బమ్మతోట తదతర ప్రాంతాలలో నాఖాబందీ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. నగరిగుట్ట ప్రాంతంలో మాట్కా, సారా విక్రయాలు, బెట్టింగులు ఎక్కువగా జరగుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రస్తుత కాలంలో యువత కూడా మద్యం, మట్కా, బెట్టింగులు ఎక్కువగా ఆడుతున్నారని సమాచారం వస్తుందన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐలు, రాజు, మద్దిలేటి, ఎస్‌లు హుస్సేన్, హనుమంతు, హృషికేశవరెడ్డిలతో కలసి నగరిగుట్టలోని సారా విక్రయాలు జరిపే ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమపిల్లలు గొడవలకు వెళ్లకుండా ఉన్నత చదువులు చదివించు కోవాలన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు తెలియ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

జమ్మలమడుగు : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తలమంచిపట్నం ఎస్ఐ గోపినాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మైలవరం మండలంలోని వద్దిరాల గ్రామంలో అనుమానిత ప్రాంతాలలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించి పలు దుకాణాలలో తనిఖీలను చేపట్టారు. ప్రజలు తమ ప్రాంతాలలో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. ఎమైన సమస్యలుంటే స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసి సమస్యలను శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

చిన్నదండ్లూరులో నాకాబందీ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్నదండ్లూరులో జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున నాకాబందీని నిర్వహించినట్లు కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. ఫ్యాక్షన్ గ్రామమైన మాలెపాడులో నాకాబందీ నిర్వహించి గ్రామంలోని ఇరువర్గాల నాయకుల ఇళ్లల్లో, గడ్డివాములలో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఫ్యాక్షన్ వీడి ప్రశాంత జీవనం సాగించాలని చిన్న చిన్న గొడవలకు పోకూడదన్నారు.


సీకేదిన్నె : వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ అరుణ్‌రెడ్డి

అజాద్‌నగర్‌లో నాకాబందీ

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఆజాద్‌నగర్‌లో ఆదివారం సీకేదిన్నె పోలీసులు నాకాబందీ చేపట్టారు. ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులులేని వాహనాలను తనిఖీ చేసి స్టేషన్‌కు తరలించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

ధరల బోర్డు ఏర్పాటు చేయాలి


మాంసపు దుకాణాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీలో మాంస విక్రయాలు జరిపే దుకాణాల వద్ద తప్పనిసరిగా ధరలకు సంబంధించిన బోర్డు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పట్టణంలోని మాంసపు దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో మాంసపు వ్యాపారస్థులతో సమావేశం నిర్వహించి కిలో రూ.650 కే విక్రయించాలని చెప్పడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఆదివారం పలు మాంసపు దుకాణాలను తనిఖీ చేశామన్నారు. మాంసపు దుకాణాల యాజమానులు అధికారులు చెప్పిన విధంగా అన్ని భాగాలు పొట్ట, పేగు, రక్తం, తల, ఎముకలు కలిపి అమ్ముతామని తెలిపారు. మంగళవారం నుంచి అధికారులు ఆదేశాలు పాటిస్తామని వారు తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని మెప్మా సంస్థ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆదివారం మహిళలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా సంస్థ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. మెప్మా సీఓలు విమల, వసంతరెడ్డిలు మాట్లాడుతూ రుతుస్రావ సంబంధిత అనారోగ్యాలబారిన మహిళలు పడుతున్నారని అందుకే మెప్మా సంస్థ రైజ్ యువర్ వాయిస్ బ్రేక్ ది సైలెన్స్ అనే నినాదంతో ర్యాలీ చేపట్టామన్నారు. తర్వాత కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో జీవనశైలి పర్యావరణ కార్యక్రమం

పోరుమామిళ్ల : మండలంలోని శ్రీ మద్దిమాను గురప్ప స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం అటవీశాఖ సిబ్బంది లైఫ్‌స్టైల్ ఎన్విరాన్‌మెంట్(జీవనశైలి పర్యావరణ) కార్యక్రమం నిర్వహించారు. సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ నేతృత్వంలో అటవీ సిబ్బంది, ప్రజలు గురప్ప స్వామి ఆలయ పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ బాటిల్లు, కవర్లు, చెత్త ఏరి, కుప్పగా వేసి కాల్చి వేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మాట్లాడుతూ అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆలయాల ఆవరణ శుభ్రంగా ఉంటే వచ్చే భక్తులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వాతావరణ సమతుల్యత కాపాడేందుకు అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది వెంకటేష్, వీరప్రతాప్, స్ట్రైకింగ్ ఫోర్స్, ప్రజలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

జమ్మలమడుగు రూరల్: మండలపరిధిలోని దేవగుడి గ్రామంలో జూదమాడుతున్న మహబుబ్‌బాషా మరో 8 మందిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 7100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అరటి పంట దగ్ధం

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన కౌలుదారుడు పి.కృష్ణారెడ్డి 5 ఎకరాల్లో అరటిపంట ప్రమాదవశాత్తు కాలిపోయింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఉదయం 10 గంటల సమయంలో పొలంలో పనులు చేసుకుంటుండగా మంటలు చెలరేగాయని తెలిపారు. ఎకరాకు రూ.20 వేలు గుత్త చెల్లించి కౌలుకు తీసుకున్నానని, పంట పూర్తిగా కాలిపోవడంతో నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వేములలో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


వీఎన్‌పల్లెలో గురువులను సన్మానించిన పూర్వపు విద్యార్థులు

వేముల : వేముల జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992–1993 బ్యాచ్‌కు సంబంధించిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళన కా ర్యక్రమం జరిగింది. విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను శాలు వ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అప్పట్లో పనిచేసిన గణిత ఉపాధ్యాయుడు సదాశివారెడ్డి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

గురువుల రుణం తీర్చుకోలేనిది

వీరపునాయునిపల్లె : గురువుల రుణం తీర్చుకోలేనిదని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి అన్నారు. స్థానిక గడ్డంవారిపల్లె నర్రెడ్డి పెద్ద సంగిరెడ్డి జూనియర్ కళాశాలలో 1982–84వ బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒక విద్యార్థిగా మరియు ముఖ్య అతిథిగా ధర్మచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. 40 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులందరం కలవడం అపూర్వ కలయిక అని ఆయన అన్నారు. ఆనాడు గురువులు బోధించిన పాఠ్యాంశాలు, వారు నేర్పిన మంచి నడవడికల వలన నేడు మనమందరం మంచి ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నామన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, లెక్చరర్లు సుబ్బయ్య, రమణారెడ్డి, గంగిరెడ్డి, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డిలను వారు ఘనంగా సన్మానించారు.

ఔషధాల గని.. నేరేడు

- కడప నగరంలో ఇప్పుడిప్పుడే ప్రారంభమైన అమ్మకాలు
- కిలో రూ.400 పలుకుతున్న ధైనం


బండిపై విక్రయిస్తున్న నేరేడు పండ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నల్లగా నిగనిగ మెరుస్తూ వగరు, తీపి, పులుపు మేళవింపు రుచులతో ఉండే నేరేడు పండ్ల అమ్మకాలు నగరంలో ప్రారంభమయ్యాయి. మార్కెట్లో కాలానుగుణంగా వచ్చే ఎన్నో పండ్లు రుచితోపాటు ఆరోగ్యాన్నిస్తాయి. అలాంటి వాటిలో అల్లనేరేడు ఒకటి. మే నెల ఆరంభంలో అల్లనేరేడు పంట చేతి కొస్తుంది. ఈ సీజన్‌లో విరివిగా దొరికే ఈ పండ్లను రుచి చూడని వారంటూ ఉండరు. అందుకే మార్కెట్లో కనిపించగానే వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. మార్కెట్లో ఇప్పుడు అల్లనేరేడు పండ్లు విరివిగా అమ్ముడవుతున్నాయి. చిత్తూరు జిల్లా మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి నేరేడు పండ్లు దిగుమతి చేసుకుంటున్నారు. కొత్తగా మార్కెట్‌లోకి వస్తుండడంతో పండ్ల వ్యాపారులు వీటిని కిలో రూ.400కు అమ్ముతున్నారు.

రాముడు మెచ్చిన పండు

రామాయణంలో శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసం చేసినప్పుడు ఎక్కువ భాగం ఈ పండ్లను తిని కాలం గడిపారని పెద్దలు చెబుతారు. అందుకనే భారత దేశంలో గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర ప్రాంతాలలో దీనిని దేవతాఫలంగా భావిస్తారు. ఆయుర్వేదంలో ఈ పండును అపర సంజీవని అని పిలుస్తారు. ఈ పండులో విటమిన్ ఏ, సీ పుష్కలంగా ఉంటాయి. నేరేడు పండు మాత్రమే కాక ఆకులు, గింజలు, చెట్ల బెరడు ఔషధ తయారీలో వాడుతారు. ఈ నేరేడు చెట్టు కాయల నుంచి వెనిగర్‌ను తయారు చేస్తారు. జ్ఞాపకశక్తి మెరుగు పరచుకోవాలంటే నేరేడు పండు తినమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధుమేహం, నోటిపూత, చిగుళ్ళ వ్యాధులు, దంతక్షయం, మూత్రంలో మంట తదితర సమస్యల నివారణకు నేరేడు పండ్లు చక్కని ఔషధంగా పని చేస్తాయి.